తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1985 మినీకథల పోటీలో రు.100/-లు బహుమతి పొందిన రచన

# స్వేచ్ఛ

దీర్ఘాశి విజయ భాస్కర్

"ఆడదానికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉండి తీరాలి- నామాట ఒక్కటి కూడా మీరు వినడం లేదు. పైగా బయటకు వెళ్ళకూడదని ఆంక్షలు విధిస్తున్నారు-!" అప్పటికి అరగంట నుండి అరుస్తోంది సావిత్రి.

"నేను ఆంక్షలు విధించడం లేదు, మన ఆర్థిక స్థోమతను బట్టి నీ బయటి వ్యాపకాలు తగ్గించు కోమం టున్నాను. వాళ్ళందరితో స్నేహాలు మనకవవసరం అం టున్నాను." అన్నాడు రామారావు.

"నేను స్నేహం చేస్తున్నది అల్లాటప్పాలతో కాదు. నేను మహిళామండలి సభ్యురాలనైన తర్వాత హైయ్యర్ సర్కిల్‌లో మీకెంత విలువ పెరిగింది! పెద్ద కాంట్రా క్టర్లు, ఆఫీసర్ల భార్యలతో నాకెంతో స్నేహముంది. అది నేను సంపాదించు కున్నాను గాని మీ ఉద్యోగం వల్ల నాకొచ్చినది కాదు."

ఒక స్త్రీ ఇంకో స్త్రీతో స్నేహం చేయడానికి ముఖ్యంగా రెండు కారణాలు వుంటాయి. ఒకటి ఆమె అందం. రెండు ఆమె యొక్క శరీరం మీది ఆభర ణాలు. సావిత్రి ఒక లెక్చరర్ భార్య. అయినా ఆమె యొక్క అసాధారణ అందం పెద్ద పెద్ద వాళ్ళ భార్యలతో ఆమెకు పరిచయాన్ని ప్రసాదించింది.

పడక కుర్చీలో కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు రామారావు. సావిత్రి మళ్ళీ మొదలు పెట్టింది. "మహి ళా మండలి లో నేను చేరిన తర్వాత కార్యక్రమాలు చురుగ్గా సాగుతున్నట్టు అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ మధ్య ఇంటింటికి వెళ్ళి వరకట్న సమస్య గురించి ఉపన్యాసాలిచ్చాం. ఆర్థిక స్వాతంత్ర్యం, పురుషులతో అన్ని విషయాల్లో సమానత్వమూ లేని స్త్రీల జీవితాలు బాగుపర్చడానికే మేమంతా కలిసి కట్టుగా పన్జేస్తున్నాం."

"మీ మండలి, దాని నిర్వాకంతో నాకు పనిలేదు. నాజీతం తప్ప నాకింకో ఆదాయం లేదు. నా రాబడితో మన సంసారాన్ని గుట్టుగా లాక్కురాగలను గాని, నీవు చేస్తున్న సంఘసేవను మాత్రం ప్రోత్సహించ లేను." అన్నాడు రామారావు.


"సంఘసేవ, సంఘసేవ అని ప్రతీసారి మీరు హేళ న చేయనవసరం లేదు. మేము చేస్తున్నది సంఘసేవే గాని డొనేషన్లు కలెక్టు చేసి వాటావేసుకోవడం లేదు. మనందరిలో అతి నిరాడంబరంగా బ్రతుకుతూ సంఘ సేవ చేస్తున్న వ్యక్తి సావిత్రి అని నాగురించి అందరితో గొప్పగా చెప్పింది, మా మండలి ప్రెసిడెంటు. ఆ మాత్రం సహృదయత గూడా మీలో లేదు."

"నీవు వాస్తవాన్ని గుర్తించడం లేదు సావిత్రి. పొగడ్త లు ప్రశంసల నిషా నీబుర్రలో వుంది. హైక్లాస్ లేడీస్‌తో తిరుగుతున్నానన్న గర్వం నీ మనసులో తాండ విస్తుంది. అంతేగానీ, తల్లిదండ్రులు చనిపోయిన దగ్గర నుండి నన్ను చదివించి, ఉద్యోగస్తుడిని చేసిన అక్క బావల ఋణం తీర్చుకోవాలని నేను చేస్తున్న హెచ్చరిక నీతలకెక్కడం లేదు." అన్నాడు రామారావు.

సావిత్రి చాలా చీత్కారంగా చూసింది రామా రావుని. ఆ చూపులో చెప్పలేని కోపం, వర్ణింప వీలులేని అలక్ష్యం వున్నాయి.

"అక్కబావల ఋణం తీర్చుకోవాలను కుంటే వాళ్ళదగ్గరే వుండి వ్యవసాయం చేసుకొని బ్రతకాల్సింది- వాళ్ళ అమ్మాయిని పెళ్ళి చేసుకొని వాళ్ళ పశువులు కాసుకొని పడి ఉండవలసింది! ఇదిగో ఇదే ఆఖరిసారి చెప్పడం—ఇంకోసారి అక్కబావల ప్రస్తావన తీసుకురా కండి; మీకు అంతగా ప్రేమ ఎక్కువయితే నెలకో వందో యాభయ్యో పంపండి, నేను వద్దనను." అని విసురుగా లోనికి వెళ్ళిపోయింది సావిత్రి.

కోపంతో పళ్ళు పటపట కొరికాడు కాని మరు క్షణంలోనే ఏమీ చేయలేని బేలతనం ఆవహించింది రామారావుని.



తను చదువుతున్నంత కాలం ఎంతో సహాయం చేశాడు బావ. అక్క సంగతి వేరే చెప్పనక్కర లేదు. కాని సంవత్సరం క్రితం పక్షవాతం వచ్చి బావకాలు, చెయ్యిపడిపోయాయి. తననే కొడుకుగా భావించుకొని బ్రతుకుతున్నారు ఆ ఇద్దరూ- లక్ష్మి ఒక్క మూడు సంవత్సరాలు ముందు పుట్టి వుంటే ఎవరికీ ఏబాధ ఉండకపోను! లక్ష్మి తన అక్క కూతురు. తన పెళ్లి నాటికి లక్ష్మి మరీ చిన్నదిగా వుండటము వలన వేరే

సంబంధం చేసుకోవాల్సి వచ్చింది-బావ రోగగ్రస్తుడైన తరువాత లక్ష్మి పెళ్లి బాధ్యత కూడా తనమీదే పడింది. మంచి సంబంధం కుదిరి ఉత్తరం వ్రాసేసరికి డబ్బు జాగ్రత్త చేయమంది అక్క.

నీటుగా ముస్తాబై ముందుగదిలోకి వచ్చింది సావిత్రి.

"భర్తలు వదిలేసిన భార్యలు కోసం ఒక వసతి గృహం నిర్మిస్తున్నాం. దానికోసం విరాళాల సేకరణ ఈరోజు నుండి ప్రారంభిస్తున్నాం. బ్యాంకులో మీ పేర మూడువేలు వున్నాయి గదా! వెళ్ళి డ్రా చేసి తీసుకు రండి. మామండలి సభ్యులనంతా తీసుకు వస్తాను. మీ చేత్తోనే వాళ్ళకా డబ్బు ఇవ్వండి" అంది సావిత్రి.

ఆమె మొండి తనానికి రెప్పలు కదల్చకుండా విభ్రాంతితో సావిత్రిని చూస్తున్నాడు రామారావు.

"ఇంట్లో మగవాళ్ళను లెక్కచేయకుండా ప్రవర్తిస్తున్నామని ఎవరో ఆమధ్య కూశారు. అందుకే ప్రతీ మెంబరు తన శ్రీవారి చేత విరాళం ఇప్పించడానికి నిర్ణయించుకున్నాం" అంది సావిత్రి.

"ఎవరిచ్చినా మూడువేలు విరాళంగా ఇవ్వడం మన తాహతుకు మించిన పని, అనవసరం. పరుగెట్టే పాలు తాగుతున్నావు. నీకు బుద్ధి, జ్ఞానం ఏమాత్రం వున్నా ఇంట్లో కూర్చో. లేకపోతే నీఇష్టం" అన్నాడు రామారావు.

"నన్ను మళ్ళీ బ్రెయిన్ వాష్ చెయ్యకండి. వాళ్ళు వచ్చాక ఏమాత్రం గొడవ జరిగినా నేను సహించను. ఆ మాత్రం స్వేచ్ఛా, స్వాతంత్ర్యము నాకూ వుండాలి. నేను వెళ్తున్నాను.. డూప్లికేట్ పట్టుకెళ్తున్నాను- ఎక్కడికైనా వెళితే తాళం వేసుకొని వెళ్ళండి" అంటూ జవాబుకైనా ఎదురు చూడకుండా చెప్పులు టక టక లాడించుకొని వెళ్ళిపోయింది.

కుర్చీలోంచి లేచి బట్టలు వేసుకున్నాడు రామారావు. పాస్‌బుక్కు కోసం పడక గదిలోకి వెళ్ళి సావిత్రి సూట్కేసు తెరిచాడు. పాసుబుక్కు తీస్తుంటే మహిళా మండలి ప్రింటు చేయించిన బుక్‌లెట్ ఒకటి చేయి జారింది. దానిలోంచి ఉత్తరం జారి క్రింద పడింది. అడ్రసు చూసాడు- తనపేరునే వచ్చింది. ఆతృతగా చదివాడు. తనకు అక్క వారం రోజుల క్రితం వ్రాసిన ఉత్తరమది. లక్ష్మికి మంచి సంబంధం వచ్చినట్టు, డబ్బు సర్దుబాటు అయితే ముహూర్తాలు పెట్టుకోవచ్చని వ్రాసింది. డబ్బు సాయం చేయమని ఎంతో దీనంగా ప్రాధేయపడుతూ వ్రాసింది. బావ, కూతురికి పెళ్ళి చేసే స్థితిలో లేడని రాసింది-మామయ్యవైనా, తండ్రివైనా నీవే అని వ్రాసింది. నా ఆడజన్మ, బావ అవిటితనం మరచిపోవద్దని వ్రాసింది- ఈ ఒక్క సాయం చేస్తే ఏడేడు జన్మలు ఋణపడి వుంటానని వ్రాసింది.

రామారావు కళ్ళు చెమర్చాయి. ఒక నిర్ణయానికి వచ్చాడు. పాసుబుక్కు జేబులో పెట్టుకొని, ఇంటికి తాళం వేసి బయట కొచ్చాడు.

సాయంత్రము నాలుగు గంటలుకి సావిత్రి పది మందిని వెంటబెట్టుకొని వచ్చింది. ఇంట్లో అందరినీ కూర్చోబెట్టి కాఫీ టిఫిన్లు తయారు చేసి ఇచ్చింది. అందరూ నవ్వుతూ, సరదాగా కాలక్షేపం చేస్తూ రామారావు రాక కోసము ఎదురు చూస్తున్నారు.

"మావారిది మరీపిచ్చి. మీరు వస్తున్నారని చెప్పాను, అంతే... ఏవో తీసుకురావడానికి మార్కెట్టుకు వెళ్ళి వుంటారు" అంది సావిత్రి. ఎదురు చెప్పని భర్త దొరికినందుకు సావిత్రి అదృష్టాన్ని సబ్జెక్టుగా తీసుకొని తలా రెండు నిమిషాలు మాట్లాడారు- సంతోషంతో సావిత్రి ఉబ్బి తబ్బిబ్బయ్యింది.

ఇలా ఆహ్లాదంగా గంట గడిచింది. ఎప్పటికి రామారావు రాకపోవడంతో అందరికీ విసుగు కలుగుతోంది.

సావిత్రికి కూడా అనుమానం ఎక్కువైంది. డబ్బు తెచ్చి ఇంట్లోపెట్టే, తను ఉండడము ఇష్టము లేక తప్పుకున్నాడేమో!

వెంటనే పడక గదిలోకి వెళ్లి సూట్కేసు వెదికింది- డబ్బులేదు-పరుపు క్రింద, ఆల్మారాలో ప్రతిచోటు వెదికింది, కాని ఒక్కపైసా కూడా కనిపించ లేదు.

అందరూ తన చర్యల్ని హేళనగా చూస్తున్నట్టు భావన రాగానే కళ్ళల్లో నీళ్ళు సుళ్ళు తిరిగాయి. ఎలాగో తనని తాను తమాయించుకుంది. మళ్ళీ నిబ్బరంగా మారింది. ఏం మనిషి ఇతను? ఈసారి తన మాటకు ఎదురు చెప్పకుండా, తను గీసిన గీటు దాటకుండా కట్టడి చేసుకోవాలి-మళ్ళీ ఇలాంటి వెధవ వేషాలు వెయ్యకుండా ఆ జన్మాంతం గుర్తుండే గుణపాఠం చెప్తాను-'అనుకుంటూ ముఖమంతా నవ్వు పులుముకొని పడక గదిలోంచి నట్టింట్లోకి రాబోయి ఆగింది. ఆగి టేబిలుపై రెపరెప లాడుతున్న కాగితాన్ని చూసింది. వణుకుతున్న చేతులతో ఆ కాగితాన్ని తీసి చదివింది.

"మా అక్కకి సహాయం చేయడమే కాకుండా ఆమెకు పూర్తి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కలిగించడానికి వెళ్తున్నాను. లాంగ్‌లీవ్ పెట్టి తర్వాత ట్రాన్స్ఫర్‌కి ట్రై చేసుకుంటాను. మనసు మారితే రావచ్చు," అని వుంది. వారం రోజుల క్రితం వచ్చిన ఉత్తరం సంగతి గుర్తు వచ్చింది. గబగబ ఉత్తరం కోసం సూట్కేసంతా వెతికింది. ఉత్తరం కనిపించలేదు. నిశ్చేష్టురాలైపోయింది. మండలి సభ్యులంతా బిలబిల సావిత్రి దగ్గరకు వచ్చారు. ఆమె చేతిలోని కాగితం చదివి తెల్లబోయారు. ఉచితరీతిలో సానుభూతి ప్రకటించి, ఒక్కొక్కరూ వెళ్తున్నారు. అలా వెళ్తున్న వారిని కన్నీటి తెరల్లోంచి చూస్తోంది సావిత్రి.

కాని వాళ్ళు అనుకుంటున్న మాటలు మాత్రం వినిపించడం లేదామెకు.

"మన వసతి గృహం లో సావిత్రినే మొట్టమొదట చేర్చవలసి ఉంటుందేమో" అంది మండలి అధ్యక్షురాలు. ఆ జోకుకి అంతా గొల్లుమన్నారు- సావిత్రి కూడా-గొల్లుమంది.

## స్వపరిచయం

శ్రీకాకుళం అంపోలు గ్రామంలో ఇరవైఆరు సంవత్సరాల క్రితం పుట్టాను. మా నాన్న దీర్ఘాశి సూర్యనారాయణగారు పీవర్సు కో-ఆపరేటివ్ సొసైటీ మేనేజర్ గా పనిచేస్తున్నారు. ప్రస్తుతం గవర్నమెంటు జూనియర్ కాలేజీ చింతపల్లిలో ఇంగ్లీషు జూనియర్ లెక్చరర్ని. మొట్టమొదటి నాటిక 'తూరుపు తెల్లారింది' అరుణోదయ వారు అచ్చు వేశారు. గురువుగారైన శ్రీ కాళీపట్నంగారి పర్యవేక్షణలో కథారచన ప్రారంభించాను. అముద్రితంగా కొన్ని కథలు, ఒక నవల వున్నాయి. పటిష్టమైన శిల్పంతో, వాస్తవానికి దగ్గరగా వుండి సాంఘిక ప్రయోజనమున్న కథలు వ్రాయాలని పట్టుదల.

—దీర్ఘాశి విజయభాస్కర్,
చింతపల్లి

